క్లుప్తంగా

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని డిఆర్‌వలస గ్రామానికి చెందిన పొంగ్రింకి తిరుపతి, యశ్వంత్ (అన్నదమ్ములు) రక్తహీనతతో బాధ పడుతున్నారు. గ్రామస్తులు, యువత రూ.14 వేలను విరాళాల రూపంలో సేకరించారు. చిన్నారుల విద్య ఖర్చుల నిమిత్తం తల్లిదండ్రులకు గ్రామ సర్పంచ్ కుమరాపు శాంతమ్మ చేతుల మీదుగా బుధవారం ఆర్థికసాయం అందించారు. ప్రస్తుతం హైదారాబాద్‌లో పెద్ద కుమారుడు చికిత్స పొందుతున్నాడు. కుమరాపు శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుమబింధు

జి.సిగడాం: సీజనల్ వ్యాధుల పట్ల వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సుమబింధు సూచించారు. మండలంలోని పెంట హెల్త్ క్లినిక్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో రోగులకు తనిఖీలు చేశారు. మంచానికి పరిమితమైన రోగులకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మినీ ఇండోర్ స్టేడియం పరిశీలన



ఇండోర్ స్టేడియం పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: మండలంలోని కొండములగాం గ్రామంలో ఉన్న మినీ ఇండోర్ స్టేడియాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు బుధవారం పరిశీలించారు. స్టేడియానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, కొండపై నుంచి వచ్చే వర్షం నీరు కొండములగాం తారురోడ్డు పైకి రావడం వల్ల రహదారి పాడైపోతుందని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కుటమి నాయకులు పాల్గొన్నారు.

లలితాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

ఎచ్చెర్ల: మండలంలోని దోమాం పంచాయతీ కేకే నాయుడుపేట గ్రామంలోని లలితాదేవి ఆలయంలో పాడ్యమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకాలు, పంచామృతం, కుంకుమ పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పరామర్శ..



జగ్గునాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని చిన్నమురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల జగ్గునాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారులు సూరినాయుడు, వెంకటప్పలనాయుడు, శ్రీను కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, పార్టీ నాయకులు మీసాల భాను, గొర్లె సూర్యప్రకాశ్, జి.కామేష్, మీసాల అప్పారావు, మీసాల రమణ, మీసాల వేణు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు గట్లుపై నాటిన మొక్కలను బాధ్యతతో పెంచాలని ఏపీఓ శోభాదేవి అన్నారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువు గట్లుపై మొక్కలను నాటినుంచి సంరక్షించేందుకు సంబంధించి నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు.

ఆధ్యాత్మిక శోభ



నందీశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకులు



బలగలో పూజలందుకున్న అయ్యప్పస్వామి



పాతశ్రీకాకుళంలో అయ్యప్పస్వామికి క్షీరాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. దీంతో ఆధ్యాత్మిక శోభ నెలకుంది. బలగలో గల అయ్యప్పస్వామి ఆలయంలో స్వామికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు ఉన్నారు. అలాగే పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలోని అయ్యప్ప స్వామికి అభిషేకాలు చేశారు. స్వామివారిని పంచామృతాలతో అభిషేకించారు. సహస్ర నామార్చనలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి అభిషేకాలు

గుడివీధిలో వేంచేసిన ప్రముఖ శైవక్షేత్రమైన ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో వృషభ త్రయోదశి సందర్భంగా నందీశ్వరునికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో అభిషేకాల అనంతరం మహా హారతిని ఇటునందీశ్వరునికి, అటు ఉమారుద్రునికి ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పాల్గొన్నారు.

70 యూనిట్ల రక్తం సేకరణ



శ్రీకాకుళం అర్బన్: రవికుమార్‌ను అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: అర్హులందరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రముఖ వైద్యులు, శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. నగరంలోని ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలోని సత్యసాయి భజన మందిర ప్రాంగణంలో లయన్స్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కొంతం సునీల్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. 70 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. సారవకోట సచివాలయ పరిధిలో వెటర్నరీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ సాహు కృషితో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆయన్ని క్లబ్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, పలు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రౌతు సుప్రజ, పొడుగు చరణ్, నవీన్, ఉర్లం శివతేజ, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ సెంట్రల్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక న్యూబ్లడ్ బ్యాంకులో కొంక్యాన శంకర్ అనే యువకుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. కార్యక్రమంలో సామాజిక సేవకులు ఉర్లాం శివతేజ ఉన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



రైతులకు భూసార పరీక్షల కార్డులు అందజేస్తున్న అధికారులు

గార: భూసార పరీక్షలను విధిగా చేయించాలని వ్యవసాయాధికారి డి.పద్మావతి అన్నారు. పరీక్షల ఆధారంగానే ఎరువుల యాజమాన్యం చేపట్టాలని వ్యవసాయాధికారి డి.పద్మావతి అన్నారు. అంపోలు-1, అంపోలు-2 ఆర్బీకేల పరిధిలో కొలు రైతుల అవగాహన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. వరి వెద పద్ధతిలో చేపట్టాల్సిన కలుపు, నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల కార్డులను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొండు జయరాం, గొండు మూర్తి, ఏఈవో జె.శ్రీదీప్తి, వీఆర్వో సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

హోం మంత్రికి సత్కారం



హోం మంత్రిని సత్కరిస్తున్న రామావతారం

జి.సిగడాం: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తను మండలంలోని వాండ్రంగి గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం వాండ్రంగి రామావతారం బుధవారం విశాఖలో ఘనంగా సత్కరించారు. మూడు దశాబ్దాల క్రితం ఇచ్ఛాపురం ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసినప్పుడు హోం మంత్రి అనిత అక్కడ చదివారన్నారు. తన శిష్యురాలు ఇలా ఉన్నత పదవిలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. హోం మంత్రి అనిత తండ్రి అప్పట్లో ఇచ్ఛాపురంలో జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహించేవారని తెలిపారు.

హాస్టల్‌కు ఫ్యాన్లు, లైట్లు వితరణ



శ్రీనివాసరావును అభినందిస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతిగృహం- 4 విద్యార్థినుల కోసం ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ఫౌండర్ సూర శ్రీనివాసరావు ఫ్యాన్లు, లైట్లను వితరణగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ సిబ్బంది దాతను సత్కరించారు. హాస్టల్ వార్డెన్ లలిత ఉన్నారు.

స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు ఈఓపీఆర్డీ దరఖాస్తు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పంచాయతీ విస్తరణ అధికారి (ఈఓపీఆర్డీ) కణితి ఈశ్వరి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కోసం ఈ ఏడాది మే 26వ తేదీన జిల్లా పరిషత్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మూడు నెలల ముందుగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది అక్టోబర్ 31వ తేదీ నుంచి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ వర్తిస్తుంది. జూన్ 24వ తేదీ నుంచి ఏడు వారాలు మెడికల్ లీవ్ పెట్టారు. 2026 మే 31వ తేదీ వరకు సర్వీస్ ఉంది. అనారోగ్య సమస్యల కారణంగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేస్తున్నట్లు ఆమె చెబుతున్నారు. మరోవక్క రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఆమె ఉద్యోగ విరమణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

చెట్లు మానవునికి స్నేహితులు

శ్రీకాకుళం: చెట్లు మానవులకు మంచి ఆక్సిజన్ అందిస్తాయని, వృక్షాలను కాపాడుకోడానికి ప్రాధాన్యతనివ్వాలని జిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకులు రత్నాల వెంకట వరప్రసాద్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నేలకోతను తగ్గించడంలో మొక్కలు సహాయపడతాయన్నారు. శ్రీకాకుళంలో హరిత వనాల పెంపకానికి అనుబంధ శాఖల సహకారాన్ని తీసుకోని చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు గేదెల ఇందిరాప్రసాద్, గాయకులు డాక్టర్ మంతెన వాసుదేవాచారి, స్టార్ వాకర్స్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, పీజీ గుప్తా, రాడ కైలాసరావు, బీవీ రవిశంకర్, బి.దేవీప్రసాద్ ఉన్నారు.

12న రెడ్‌క్రాస్ వార్షిక సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 12న ఉదయం 11 గంటలకు బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు, పేట్రన్స్, వైస్ పేట్రన్స్, కమిటీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో రెడ్‌క్రాస్‌కు విరాళాలు ఇచ్చిన దాతలకు, రక్తదాన శిబిరం నిర్వాహకులకు, నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు, సేవలందించిన రెడ్‌క్రాస్ వలంటీర్లకు అవార్డులను అందజేసి సన్మానిస్తామన్నారు.

ప్రజాప్రతినిధులకు విలువ లేదా?



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్: కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంత మాత్రాన ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను విస్మరించి ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సబబు అని సభ్యులు ప్రశ్నించారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిజగింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిరసనలు తెలియజేశారు. ఈదుపురం, కేశుపురం సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, గుజ్జు ఢిల్లీరావులు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం జూలై నెలలో పంపిణీ చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ప్రొటోకాల్‌ను పాటించకుండా అధికారులు టీడీపీ కార్యకర్తలచే పంపిణీ ప్రక్రియను చేపట్టడం సబబుగా లేదన్నారు. ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వరాదంటూ భారత రాజ్యాంగంలో ఏమైనా మార్పులు, చేర్పులు చేశారా అని ప్రశ్నించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. ఈ చర్యను ఖండిస్తున్నామని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు అయినటువంటి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనే హక్కు ఉందన్నారు. పార్టీలకు కొమ్ము కాస్తూ అధికారులు వారిని విస్మరించడం తగదన్నారు. సమన్వయంతో అందరినీ కలుపుకుంటూ విధులు నిర్వహించాలని అధికారులను సూచించారు. ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమంతో పాటు జూలై 15 వరకు లెప్రసీ సర్వే నిర్వహిస్తున్నట్లు కొళిగాం పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ కాశ్యాణీ అన్నారు. ఆర్‌డబ్ల్యూస్ జేఈఈ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని చెప్పారు. మరో నెల రోజుల్లో అన్ని గ్రామాలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈదుపురం సర్పంచ్ నర్తు ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది జూన్ నెలాఖరుకల్లా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలో సొమ్ము జమ చేసేవారన్నారు. ఇప్పుడు జూలై నెల ప్రారంభమైనప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మకు వందనం పథకాన్ని అమలు పరచడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. వ్యవసాయాధికారి టి.భార్గవి మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, ఆరు రకాల విత్తనాలను రైతులకు అందజేసినట్టు చెప్పారు.

విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలు



టెక్కలి మాట్లాడుతున్న ఫాలెన్ డేవిడ్

టెక్కలి: సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం విదేశాల్లో ఉన్నటువంటి ఉన్నత విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన లియో గ్లోబల్ ఓవర్‌సీస్ వ్యవస్థాపక డైరెక్టర్ ఫాలెన్ డేవిడ్ సూచించారు. విదేశీ విద్య అంశంపై బుధవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యూకే, కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడం వలన అత్యధిక వేతనాలతో ఉద్యోగవకాశాలు ఉన్నాయన్నారు. చదువులకు అవసరమైన ఆర్థిక సాయం సైతం అందజేయడానికి ఎన్నో బ్యాంకులు ముందుకు వస్తున్నాయని ఫాలెన్ డేవిడ్ తెలిపారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్నత విద్యకు సంబంధించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. గ్లోబల్ ఓవర్‌సీస్ సంస్థ పూర్తి బాధ్యతలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అడ్మిషన్ డైరెక్టర్ వాసవి, అసోసియేషన్ డీన్ డి.యుగంధర్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

కమిషనర్‌గా ఓబులేసు బాధ్యతల స్వీకరణ



కమిషనర్ ఓబులేసుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) చల్ల ఓబులేసు బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ.. నగరాన్ని మురుగునీటి ముప్పునుంచి తప్పించేందుకు కృషి చేస్తానన్నారు. సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఏసీపీలు రమణమూర్తి, వరహాలబాబు, ఎంఈ గంగాధరరావు తదితరులున్నారు.

బోధన ముదింపునకే టీచ్‌టూల్



మాట్లాడుతన్న లక్ష్మీనారాయణ

సోంపేట: ఉపాధ్యాయుని బోధనా పద్ధతిని ఒక నమూనాలో ముదింపు చేయడానికే టీచ్‌టూల్‌ను అభివృద్ధి చేసినట్లు సమగ్ర శిక్షా అకాడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు జొరాడు, క్రిష్ణంరాజు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం



రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి రోడ్‌లో ప్రత్తి అన్వేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతరం ఎటువంటి ఆదరణకు నోచుకోని పలువురికి దుప్పట్లు, దుస్తులు అందజేశారు. అలాగే క్రైస్తవుల అభ్యున్నతికి పాటుపడుతున్న పాస్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రభుదాస్, బీమోబెహర, క్రిస్టియన్ పెద్దలు ప్రత్తి గోపాల్, వీరబాబు, ప్రకాశ్ పాల్గొన్నారు.

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



రికార్డులు పరిశీలిస్తున్న కుమార్‌రాజు తదితరులు

టెక్కలి: నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు చెప్పారు. టెక్కలి శాఖా గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయంలో పాఠకులకు, నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. గ్రంథాలయాలకు సెస్ నిధులను చెల్లించే విషయంలో పంచాయతీ యంత్రాంగం చొరవ చూపాలన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.శంకర్‌రావు, గ్రంథాలయాధికారి బి.రూపావతి ఉన్నారు.

ఓంకార్ మాస్టార్ కుటుంబానికి మాజీమంత్రి పరామర్శ



పరామర్శలో మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

పలాస: పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయ ఉద్యమ నేత, సామాజిక కార్యకర్త బత్తిన ఓంకార్ మాస్టారు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం పరామర్శించారు. ఇటీవల ఓంకార్ గుండెపోటులో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అప్పలరాజు వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాపాక చిన్నారావు, బత్తిన హేమారావు, మాజీ సర్పంచ్ అప్పలస్వామి, కోరాడ లింగమూర్తి, బత్తిన మాధవరావు ఉన్నారు.

ఉత్సాహంగా మెకానిక్‌ల దినోత్సవం



కవిటీలో ర్యాలీ చేస్తున్న మెకానిక్‌లు

కవిటి: ప్రపంచ టూవీలర్ మెకానిక్స్ దినోత్సవాన్ని కవిటిలో చింతామణి టూవీలర్ మెకాని క్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘ నంగా నిర్వహిచారు. ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కేక్ కట్ చేసి సభ్యులంతా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ద్విచ క్ర వాహనదారులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. సంఘం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో ర్యాలీ నిర్వహించి సంఘం ఐక్యతను చాటి చెప్పారు.

ప్లాస్టిక్ వినియోగం వద్దు

ఇచ్ఛాపురం: ప్లాస్టిక్ నివారణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక సీబీఎస్ ఈ పాఠశాల కార్యదర్శి జోహార్‌ఖాన్ అన్నారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా బహిష్కరిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.